సాక్షి నల్లగొండ
శుక్రవారం ׀ 5 ׀ జనవరి ׀ 2024



పోస్టాఫీసు వద్ద ఆందోళన

నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలోని సబ్ పోస్టాఫీస్ వద్ద ఖాతాదారులు గురువారం ఆందోళన చేశారు. - 8లో



క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు

కేతేపల్లిలోని మేరి జపమాలమాత చర్చిలో శుక్రవారం నుంచి క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు జరగనున్నాయి. - 10లో



భగీరథ నీరందించాలి

ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీరు అందించాలని మిషన్ భగీరథ ఇంట్రా ఎస్ఈ వెంకటేశ్వర్లు అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

నార్కట్‌పల్లి ఎస్‌ఐ సస్పెన్షన్

నల్లగొండ క్రైం: నార్కట్‌పల్లి ఎస్‌ఐ సైదాబాబును సస్పెండ్ చేస్తూ గురువారం ఐజీ తరుణ్ జోష్ ఉత్తర్వులు జారీ చేశారు. గతలో సదరు ఎస్‌ఐ పలు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు పోలీస్ నిఘా విభాగం అధికారులు ఇచ్చిన నివేదికను అప్పటి ఎస్పీ అపూర్వ రావు ఉన్నత అధికారులకు అందజేశారు. దీంతో ఎస్‌ఐ సైదాబాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలోనూ వేరే చోట విధులు నిర్వహించే సమయంలో సైదాబాబు అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయి తిరిగి విధుల్లో చేరిన విషయం తెలిసిందే.

7 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

మాడుగులపల్లి: మండలంలోని కుక్కడం గ్రామంలో ఈనెల 7వ తేదీ నుంచి 15 వరకు జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడల నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జట్లు రూ.800 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేత జట్లకు మొదటి బహుమతిగా రూ.20,016 నగదు, రెండో బహుమతి రూ.15,016, మూడో బహుమతి 10,016, నాలుగో బహుమతి 5,016 నగదు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ : 9133167243, 9603681487, 9133474003 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ(టాంకామ్) లిమిటెడ్ ద్వారా విదేశాల్లో ఉద్యోగాల కోసం ఈ నెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ, భాషా నైపుణ్యం, విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ సంస్థ విదేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఏజెన్సీలతో భాగస్వామ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం జపాన్‌లో హాస్పిటాలిటీ రంగానికి మంచి డిమాండ్ ఉందని, ఎంపికైన వారికి రూ.లక్ష నుంచి రూ.1.50లక్షవరకు వేతనం ఉందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు సంస్థ మేనేజర్ సెల్ : 9100798204, 7893566493నంబర్లను సంప్రదించాలని కోరారు.

యాదాద్రిలో వైభవంగా సుదర్శనహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా వైభవంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు.

ఫుట్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపిక

ఆలేరు రూరల్ : మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన చిట్టిమల్ల సంధ్య ఫుట్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికైంది. ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-19 విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరచడంతో జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. సంధ్య ఆలేరులోని వీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ అయ్యప్ప తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

హుజూర్‌నగర్ : లేబర్‌కార్డు కలిగిఉన్న కార్మికుల కుటుంబాలకు చెందిన మహిళలకు హుజూర్‌నగర్ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ)లో ఈనెల 9నుంచి 3 నెలల పాటు ఇవ్వనున్న ఉచితంగా కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ సెంటర్ ట్రైనర్ తాటికొండ కృష్ణవేణి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఉచిత కుట్టుమిషన్, న్యాక్ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. వివరాలకు హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో గల శిక్షణ కేంద్రంలో, సెల్ నంబర్ 9908409884ను గానీ సంప్రదించాలని కోరారు.

కొత్త జాబితాతోనే..

నూతన ఓటరు లిస్టు ప్రకారంగానే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

- ప్రతి గ్రాడ్యుయేట్ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సిందే
- ఫారం-18 ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం
- డిగ్రీ పూర్తయి 2023 నవంబర్ 1 నాటికి మూడేళ్లు నిండి ఉండాలి
- వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు



నల్లగొండ: కొత్త ఓటరు జాబితాతోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. గతంలో జరిగిన ఎన్నికల ఓటర్ల జాబితాతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తాజాగా వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎన్నిలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది.

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 2021 మార్చిలో జరిగాయి. ఆ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. అయితే, ఆయన ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఆరు మాసాల్లో పట్టభద్రుల ఆ స్థానానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అందులో భాగంగానే ఎన్నికల సంఘం ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల చేసింది. పట్టభద్రుల ఎన్నికలను ప్రతిసారి కొత్త ఓటరు జాబితాతోనే ఎన్నికల సంఘం నిర్వహిస్తోంది.

ఫిబ్రవరి 6 వరకు ఓటు నమోదు

2023 డిసెంబర్ 30 తేదీ నుంచి పట్టభద్రుల ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2024 ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటు నమోదుకు గడువు ఉంది. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో కూడా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్లు ఫారం-18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులను ఫిబ్రవరి 21 వరకు పరిశీలిస్తారు. ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. అదే రోజు నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. మార్చి 29వ తేదీ వరకు నిబంధనల ప్రకారం లేని వాటిని పరిష్కరిస్తారు.

ఏప్రిల్ 4 తుది జాబితా

పట్టభద్రుల ఓటరు తుది జాబితాను ఏప్రిల్ 6వ తేదీన ప్రకటిస్తారు. అంతకు ముందు ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలను అధికారులు పరిష్కరించిన తరువాత తుది జాబితా ప్రకటిస్తారు. ఆ జాబితాతోనే ఎన్నికలు జరుగుతాయి.

డిగ్రీ పూర్తయి 2023 నవంబర్ 1 నాటికి మూడేళ్లు నిండిన వారు అర్హులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకోసం ఎన్నికల సంఘం అర్హతలను ప్రకటించింది. సంప్రదాయ డిగ్రీ లేదా ఇంజినీరింగ్ డిగ్రీ లేదా తత్సమానమైన అర్హత కలిగిన కోర్సు పూర్తి చేసి 2023 నవంబర్ 1వ తేదీ నాటికి మూడేళ్లు నిండి ఉండాలి. అలాంటి వారు మాత్రమే పట్టభద్రుల ఎన్నికల ఓటు నమోదుకు అర్హులుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది.

ఓటు నమోదు అధికారిగా అదనపు కలెక్టర్

పట్టభద్రుల ఓటు నమోదు అధికారిగా నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఉమ్మడి నల్లగొండ , ఖమ్మ, వరంగల్ జిల్లాల ఆర్డీవోలు, తహశీల్దార్లు సహాయ ఓటరు నమోదు అధికారులుగా వ్యవహరిస్తారు.

చి'వరి'కి అందని సాగునీరు



సాగుకు నోచుకోని ప్రాజెక్టు చివరి భూములు



అధ్వానంగా ప్రధాన కాల్వ

- యాసంగికి గతనెల 12వ తేదీన శాలిగౌరారం ప్రాజెక్టు నీటి విడుదల
- 25 రోజులు అవుతున్నా ఆయకట్టు చివరికి చేరని నీరు
- ప్రధాన, ఇతర కాల్వలు అధ్వానంగా ఉండడమే కారణం
- ఇప్పటికే దాటిపోయిన వరినార్లు పోసుకునే అదును
- అయోమయంలో రైతులు

ప్రాజెక్టు ఆయకట్టు వివరాలు

పూర్తిస్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	11 అడుగులు
ఆయకట్టు విస్తీర్ణం	5 వేల ఎకరాలు
ఇప్పటి వరకు సాగైంది	2 వేల ఎకరాలు

మూడు వేల ఎకరాలు బీడుగానే..

శాలిగౌరారం ప్రాజెక్టు పరిధిలో మండలంలోని శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, గురుజాల, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాల్లో 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే యాసంగి సీజన్‌కు నీటి విడుదల జరిగి 25 రోజులు అవుతున్నా చివరి భూములకు సాగునీరందకపోవడంతో కేవలం 2వేల ఎకరాలు సాగులోకి రాగా 3 వేల ఎకరాలు బీళ్లుగానే ఉన్నాయి.

శాలిగౌరారం: యాసంగి సీజన్ సాగునీరు అందక శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూముల రైతులు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన ఈ ప్రాజెక్టు నుంచి యాసంగి వరిపంట సాగుకు నీటి విడుదల చేసి 25 రోజులు అవుతున్నా నేటికీ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు చేరలేదు. 21 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం కలిగిన ప్రాజెక్టులో 11 అడుగులకు చేరుకోగానే రైతుల విన్నపం మేరకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం గతనెల 12వ తేదీన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేశారు. కానీ ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వలతో పాటు పంట కాల్వలు పూర్తిగా పూడికతో నిండిపోవడంతో వాటిలో నీరుపారడం కష్టతరంగా మారింది. దీనికి తోడు ప్రధాన కాల్వల తూముల గుండా నీటి వృథా జరుగుతోంది. దీంతో సాగునీరందక చివరి భూముల రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

కాల్వల అభివృద్ధిపై పట్టింపేది?

ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాలువలను అభివృద్ధి పరిచే విషయంలో అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి రైతులే సొంత ఖర్చులతో కాలువల్లో పూడికతీత చేపడుతున్నారు. ఈసారి ప్రాజెక్టు నీటి మట్టం కనిష్టస్థాయికి పడిపోవడం, ప్రాజెక్టులోకి నీరువచ్చి చేరే పరిస్థితి కనిపంచకపోవడంతో యాసంగి పంటకు సాగునీరు అందుతుందో లేదోనని రైతులు ముందస్తుగా కాల్వల్లో శ్రమదానాలు చేసి పూడిక తీసుకున్నారు. అయినప్పటికీ అక్కడక్కడా కాల్వలు అస్తవ్యస్తంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆలస్యంగా నీటి విడుదల జరగడం, ఇంతలోనే వ్యవసాయ బావులు, బోర్ల కింద వరినాట్ల పనులు మొదలు కావడంతో రైతులు బిజీగా మారారు. కానీ, చివరి భూముల రైతులు మాత్రం ఇంకా సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికీ నార్లు పోసుకునేందుకు అదును కూడా గడిచిపోవడంతో రైతులు ఆలస్యంగా పంటసాగు చేస్తే దిగుబడి వస్తుందో రాదోనని మదనపడుతున్నారు.

సాగునీటికి అవస్థలు పడుతున్నాం



ప్రాజెక్టు కుడికాల్వ కింద చివరన ఉన్న ఓ రైతు వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వరి పంటను సాగుచేశాను. సాగునీటి కోసం 20 రోజులుగా రేయింబవళ్లు కాల్వ వెంట తిరుగుతూ తీవ్ర అవస్థలు పడుతున్నాం. సీజన్ ఆరంభంలోనే ఇలా ఉంటే ఇక సీజన్ ముగింపు దశలో ఎలా ఉంటుందో అర్థం కావడం లేదు.

– వాడపల్లి వెంకన్న, రైతు, బాలిశెట్టిగూడెం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఆయకట్టు చివరి భూములకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వల్లో పూడిక తీత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఈసారి ప్రత్యామ్నాయ మార్గాలు లేనందున పంట కాల్వల్లో పూడికతీతను రైతులే తీసుకోవాలని కోరుతున్నాం.

– రాములు, ఏఈ, శాలిగౌరారం ప్రాజెక్టు

లూయిస్ బ్రెయిలీ సేవలు చిరస్మరణీయం



లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జిల్లా అధికారులు

నల్లగొండ: అంధుల కోసం ప్రత్యేక బ్రెయిలీ లిపి కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ సేవలు చిరస్మరణీయమని జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ.కృష్ణవేణి, డీఆర్‌డీఓ కాళిందిని అన్నారు. లూయిస్ బ్రెయిలీ 215 జయంతిని గురువారం నల్లగొండలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ఉద్యోగులు, విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతర కేక్ కట్ చేసి మాట్లాడారు. బ్రెయిలీ కంటి చూపును కోల్పోయినప్పటికీ సమాజంలోని అంధుల కోసం ప్రత్యేక బ్రెయిలీని రూపొందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అంధ ఉద్యోగి బాలయ్యని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంధుల సంక్షేమ సంఘ జిల్లా నాయకులు క్రాంతికుమార్ సైదులు, మహిళా శిశు సంక్షేమ దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ సిబ్బంది శ్రీహరి, వెంకట్ రెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ఉద్యోగులు, విద్యార్థులు

తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలి

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ: ప్రజా పాలన ద్వారా స్వీకరించిన అన్ని దరఖాస్తులను తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. గురువారం ప్ర జాపాలన నియోజకవర్గ, మండల ప్రత్యేక, ఇతర అధికారులతో వెబెక్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం యూనిట్‌గా అన్ని దరఖాస్తులు శుక్రవారం (5వ తేదీ) ప్రజా పాలన గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్న టీమ్ లీడర్లు డేటా ఎంట్రీ చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు పర్యవేక్షించాలని, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు మానిటరింగ్ చేయాలని సూచించారు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే డేటా ఎంట్రీ నిర్వహించాలని, ఇందుకు కంప్యూటర్ ఆపరేటర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఏయే శాఖల్లో ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయి? ఎంత మంది ఆపరేటర్లు అందుబాటులో ఉన్నారో వివరాలు సేకరించాలన్నారు. దరఖాస్తులన్నిటినీ జనవరి 17లోగా డేటా ఎంట్రీ పూర్తి చేసి, స్టోర్ చేయాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శుక్రవారం శిక్షణ నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు.

అవినీతిపరులు జైలుకు వెళ్లడం ఖాయం

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన మంత్రులు జైలుకు వెళ్లడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పథకాలు, ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, దోషులైన అప్పటి మంత్రులను విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై కేవలం నెల రోజులైనప్పటికీ బీఆర్‌ఎస్ నాయకులు పథకాల అమలులో ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేసి తీరుతుందన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, బీసీ బంధు, మైనార్టీల రిజర్వేషన్ వంటి ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ బంటు కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి గాలం వెంకన్నయాదవ్, సందాల శంభయ్య, ఖాదర్, జకీర్, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లకు ఆ పార్టీ గురువారం పార్టీ విప్ జారీ చేసింది. గత మున్సిపల్ ఎన్నికల్లో 21 మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున విజయం సాధించారు. ఈనెల 8న నీలగిరి మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై అవిశ్వాసం ఉండడంతో ముందస్తుగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంబంధిత 20 మంది కౌన్సిలర్లకు విప్ నోటీస్‌లు పంపించారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు కొందరు, ఎన్నికల తర్వాత మరి కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు గతనెల డిసెంబర్‌లో జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీస్ అందజేయగా, కౌన్సిలర్లందరికీ కలెక్టర్ నోటీస్‌లు జారీ చేశారు. ఈనెల 8న అవిశ్వాసం కోసం కలెక్టర్ సమావేశం ఏర్పాటుకు నిర్ణయించారు. దాంతో బీఆర్‌ఎస్ పార్టీ తమ కౌన్సిలర్లకు విప్ జారీ చేసింది.

గడువులోగా సీఎంఆర్ అందించాలి




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, చిత్రంలో డీఎస్‌ఓ, డీఎం, ఆర్డీఓ, మిల్లర్లు

మిర్యాలగూడ: రైస్ మిల్లర్లకు ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోపు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లుల్లో కస్టం మిల్లింగ్ ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 69 రైస్ మిల్లుల నుంచి 2,100 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉందని, ఈనెల 20లోపు కస్టం మిల్లింగ్ ధాన్యాన్ని మర పట్టి ఎఫ్‌సీఐకు అప్పగించాలన్నారు. మిల్లుల వారీగా ఇప్పటివరకు వచ్చిన సీఎంఆర్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోపు సీఎంఆర్ పూర్తిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ చెన్నయ్య, సివిల్ సప్లయ్ డీటీ జావెద్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌కు మోక్షమెప్పుడో!

నీలగిరిలో 40 ఏళ్ల క్రితం నాటిదే నేటికీ అమలు

- అప్‌డేట్ కాకపోవడంతో ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ
- ఏళ్లుగా సాగుతున్న కొత్త ప్లాన్ ప్రతిపాదన
- కొత్త ప్రభుత్వంలో పూర్తికావడంపై సందిగ్ధం



నల్లగొండ పట్టణ వ్యూ

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీకి కొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు మోక్షం కలగడం లేదు. మున్సిపాలిటీలో అనేక గ్రామాలు విలీనమైనా నేటికీ 40 ఏళ్ల కిందటి ప్లాన్ మాత్రమే అమల్లో ఉంది. పాత మాస్టర్ ప్లాన్ వల్ల మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం భారీగా కోల్పోతోంది. వివిధ కారణాల వల్ల నీలగిరి మాస్టర్ ప్లాన్ ముందుకు సాగుతలేదనే చర్చ కొనసాగుతోంది. ఎప్పటికప్పుడు అధికారులు మారడం ఒక కారణమైతే.. రాజకీయ కారణం మరోటి అని చెప్పవచ్చు. గత ఏడాది ద్వితీయార్థంలో మాస్టర్ ప్లాన్ కొలిక్కి వచ్చినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఘటనల కారణంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మాస్టర్ ప్లాన్‌లు నిలిపివేయాలని మున్సిపల్ అధికారులకు గత ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. గ్రీన్ బెల్ట్ విషయంలో కామారెడ్డి మున్సిపాలిటీలో పెద్ద రగడ జరగడంతో అన్ని మున్సిపాలిటీల మాస్టర్ ప్లాన్‌లకు ఎఫెక్ట్ తగిలింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం రావడంతో మాస్టర్ ప్లాన్‌పై మళ్లీ చర్చ మొదలైంది. నూతన ప్రభుత్వంలో కొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు మోక్షం కలగనుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది.

గతేడాది తయారైంది ఆమోదిస్తారా లేదా!

2022లో రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాంతో మున్సిపల్ అధికారులు పలుసార్లు వివిధ శాఖల అధికారులతో చర్చలు జరిపి ప్రణాళికలు తయారు చేశారు. దాదాపు 90 శాతం వరకు మాస్టర్ ప్లాన్ పూర్తయినట్లు అప్పట్లో అధికారులు చెప్పారు. కానీ మారిన పరిస్థితుల కారణంగా అప్పటి ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు చెప్పినట్లు అధికారులు చేశారనే ఆరోపణలు కూడా ఉండడంతో దానిని మార్చుతారనే ప్రచారం కూడా లేకపోలేదు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ఇప్పటి వరకు అయితే మున్సిపల్ అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గత ఏడాది తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులు చేసి దానినే ఆమోదిస్తారా లేక సమూలంగా మార్పులు చేస్తారా అనేది వేచి చూడాల్సిందే. కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లోకి వచ్చే వరకు కొత్త చట్టం ప్రకారం మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం మాత్రం కోల్పోయే అవకాశం ఉంది. కొత్త ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇస్తే గానీ అధికారులు ముందుకు పోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

14ఏళ్ల క్రితమే ప్లాన్‌కు ప్రతిపాదనలు

నీలగిరి మున్సిపాలిటీకి కొత్త మాస్టర్ ప్లాన్‌కు ప్రతిపాదనలు రూపొందించడం ప్రారంభించి 14 సంవత్సరాలు అవుతోంది. మొదట్లో మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు ప్రారంభించిన అధికారిని లక్షల రూపాయలు ఖర్చు చేశారు తప్పితే ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మాస్టర్ ప్లాన్ పూర్తి కావస్తుందని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూడా చెప్పిన అధికారి బదిలీ అయిపోయారు. మాస్టర్ ప్లాన్ మాత్రం పది శాతం కూడా పూర్తి చేయకుండా నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత 2017 సంవత్సరంలో మరోసారి తెర పైకి వచ్చినా అమలుకు నోచుకోలేదు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి


రవి మృతదేహం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామంలో గురువారం తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగ రవి(38) రోజు మాదిరిగా గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో మోకు పట్టుతప్పి కాలు జారి కిందపడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలిని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడు నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిందితుల గుర్తింపు

ఆత్మకూరు(ఎం): మండలంలోని రాయిగిరి–మోత్కూరు ప్రధాన రోడ్డు పక్కనే గల రైతుల ఇళ్ల వద్ద వ్యవసాయ సామగ్రి, విద్యుత్ తీగలను అపహరించుకుపోయిన వ్యక్తులు తిరుమలగిరికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంతో పాటు పోసానికుంట వద్ద మంగళవారం రాత్రి రైతులకు చెందిన వ్యవసాయ పరికరాలు, విద్యుత్ తీగలు, ట్రాక్టర్ సామగ్రి పంప్‌సెట్లు, పైపులు ఆటోలో నింపుకుని తరలిస్తుండగా గ్రామస్తులు గమనించి వెంటబడ్డారు. దీంతో వారు ఆటోను వదిలి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. అపహరించుకుపోయిన వారిని తిరుమలగిరికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వారు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

వానరానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్): ఆత్మకూరు మండలం దాచారం గ్రామంలో వానరం మృతిచెందగా గ్రామస్తులు అంత్యక్రియలు చేశారు. గురువారం ఉదయం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో వానరం మృతి చెంది ఉంది. గమనించిన స్థానికులు దానికి స్నానం చేయించి పూలదండ వేసి, ట్రాక్టర్‌పై ఊరేగించారు. అనంతరం ఊర చెరువులోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళకు సీటు ఇవ్వాలంటే.. కొట్టారు

- యాదగిరిగుట్టలో ప్రయాణికుడి ఆవేదన


యాదగిరిగుట్టలో పోలీసు కానిస్టేబుల్‌కు వివరాలు చెబుతున్న నాని

యాదగిరిగుట్ట: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తరువాత మహిళలు తమ కుటుంబ సభ్యులతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి అధికంగా వస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం సికింద్రాబాద్‌కు చెందిన బండి నాని, మౌనిక దంపతులు తమ పిల్లలతో కలిసి యాదాద్రీశుడి దర్శనానికి ఉదయం వచ్చారు. శ్రీస్వామివారిని దర్శించుకొని సాయంత్రం 5గంటల సమయంలో తిరిగి సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు యాదగిరిగుట్ట పట్టణంలోని బస్టాండ్ వద్దకు వచ్చారు. సికింద్రాబాద్‌కు వెళ్లే బస్సులో నాని తన భార్య మౌనిక, పిల్లలతో కలిసి ఎక్కారు. ఇందులో మహిళల సీట్లలో పురుషులు కూర్చోవడంతో.. ఇది లేడిస్ సీటు.. మా పిల్లలు, భార్య కూర్చుంటుందని కొద్దిగా లేవండి అని ప్రయాణికులను కోరాడు. ఈ సమయంలో మహిళల సీటులో కూర్చున్న పురుషులు నానితో వాగ్వాదానికి దిగారు. ఆరుగురు ప్రయాణికులు నానితో పాటు ఆయన భార్య మౌనికలను తీవ్రంగా కొట్టారు. బస్సును డ్రైవర్, కండక్టర్ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నిలిపి, కానిస్టేబుల్‌ను తీసుకువచ్చి గాయపడిన నాని, మౌనికలను సముదాయించారు. తనను కొట్టిన వ్యక్తులపై కేసు పెట్టమంటే.. తమనే దింపేసి వెళ్లిపోయారని నాని, మౌనిక వాపోయారు. ముఖానికి గాయమైన నానిని తన భార్య మౌనిక ఆస్పత్రికి తీసుకెళ్లింది.

పోస్టాఫీసు వద్ద బాధితుల ఆందోళన


పోస్టాఫీసు వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

నాగార్జునసాగర్: పైలాన్‌కాలనీలోని సబ్ పోస్టాఫీస్‌లో ఖాతాదారుల సొమ్ము సుమారు రూ.కోటిన్నరకుపైగానే సబ్ పోస్టుమాస్టర్ పెరుమాల రామకృష్ణ విత్‌డ్రా చేసుకొని వెళ్లిపోవడంతో ఖాతాదారులు పోస్టాఫీసు వద్ద గురువారం ఆందోళన చేశారు. ఖాతాల్లో నగదు మాయమవుతోందని సంవత్సరం నుంచి ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నా పట్టించుకోలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వ్యక్తి నగదుతో పరారై 20 రోజులైనా అతనిని పట్టుకోవడంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సంబంధిత అధికారులను సస్పెండ్ చేసి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

వైన్ షాప్‌ను వేరేచోటుకు తరలించాలి


వైన్‌షాప్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

గరిడేపల్లి: మండల కేంద్రంలోని కల్మలచెరువు రోడ్డులో గల వైన్‌షాప్‌ను వేరే చోట ఏర్పాటు చేయాలని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దుకాణం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ నడిబొడ్డున సంఘమిత్ర కార్యాలయం, అయ్యప్ప దేవాలయం, నవచైతన్య పాఠశాల ఉందని, ఈ ప్రాంతంలో వైన్‌షాప్ ఏర్పాటు చేయడం ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. గతంలో అందరూ వ్యతిరేకించడంతో ఇదే వైన్‌షాప్‌ను గ్రామ శివారులో ఏర్పాటు చేశారని, నేడు మళ్లీ ఇక్కడ పెట్టారన్నారు. ఈ వైన్‌షాప్‌ను ఇక్కడి నుంచి వేరేచోటకు తరలించాలని యాజమాన్యానికి తెలిపామని, నెల రోజులైనా వారు మార్చకుండా ఇక్కడే నడుపుతుండడంతో నిరసన వ్యక్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పైడిమర్రి రంగనాథ్, బండా నర్సిరెడ్డి, కానుగ హుస్సేన్, రాములమ్మ, ముత్యాలు, శ్రీనివాసరెడ్డి, లక్ష్మారెడ్డి, సైదులు, కాశయ్య, రమేష్, సాంబయ్య, సైదులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడిన పశ్య వెంకటరెడ్డి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ


మాట్లాడుతున్న పశ్య పద్మ

హుజూర్‌నగర్: ప్రజల పక్షాన పోరాడిన నేత దివంగత పశ్య వెంకటరెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో పశ్య వెంకట రెడ్డి సంతాప సభను సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయుధ పోరాట కాలం నుంచి ఇప్పటి వరకు పశ్య వెంకట్ రెడ్డి కుటుంబీకులు సీపీఐ సిద్ధాంతాలకు అనుగుణంగా పోరాడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మత విచ్ఛిన్న రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. విద్యా, వైద్యం ఉపాధి లాంటి అంశాలకు బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఎదుర్కొనేందుకు 38 పార్టీలు కలిసి ఇండియన్ కూటమిగా ఏర్పడ్డాయని తెలిపారు. అన్ని పార్టీలు ఐక్యమై మతతత్వ, ప్రజావ్యతిరేక పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఎం వెంకటేశ్వర్లు, జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సజన, దేవరం మల్లేశ్వరి కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్ రావు, సీపీఎం నాయకులు నాగారం పాండు, దుగ్గి బ్రహ్మం, బీఆర్ఎస్ నాయకులు చిట్యాల అమర్నాథరెడ్డి, మాజీ సర్పంచులు గొట్టే రామయ్య, కోట సూర్యప్రకాష్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం


పోలీస్‌స్టేషన్‌కు తరలించిన టిప్పర్లు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లకు మట్టిని తరలిస్తున్న టిప్పర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు మండల పరిధిలోని కందగట్ల నుంచి కొద్ది రోజులుగా టిప్పర్లలో మట్టిని తరలిస్తుండడంతో స్థానికులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో సీసీ రోడ్లు పాడవుతున్నాయని, మట్టి తరలింపు ఆపాలని స్థానికులు బుధవారం రాత్రి టిప్పర్లను అడ్డుకుని అధికారులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న తహసీల్దార్ కృష్ణ, ఎస్సై వెంకట్‌రెడ్డి టిప్పర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మోతె: మండల పరిధిలోని నర్సింహాపురం బ్రిడ్జి వద్ద గురువారం పాలేరు వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మోతె ఎస్సై వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే వాల్టా కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇంట్లో నగదు, నగలు అపహరణ


బీరువాలో చిందరవందరగా పడేసిన దుస్తులు

హాలియా: గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నగదు, నగలను అపహరించారు. ఈ ఘటన హాలియా పట్టణంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయి ప్రతాప్‌నగర్‌లో అంకిశెట్టి సురేష్, కోమలి నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం తమ పిల్లలను స్కూల్‌కి పంపిన కోమలి ఇంటికి తాళం వేసి మిర్యాలగూడలోని బంధువుల శుభకార్యానికి వెళ్లింది. సురేష్ స్థానికంగా ఏర్పాటు చేసుకున్న తన షాపు వద్దకు వెళ్లాడు. సాయంత్రం స్కూల్ నుంచి పిల్లలను తీసుకొని సురేష్ తన ఇంటికి వెళ్లేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులో దాచిన రూ. 2లక్షల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడకు పోలీసులు, క్లూస్‌టీం చేరుకుని వేలిముద్రలు సేకరించారు. సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో బంగారు పుస్తెలతాడు..

డిండి: ఆర్టీసీ బస్సు ఎక్కడానికి వెళ్తున్న క్రమంలో ఓ మహిళ మెడలోంచి 1.5 తులాల బంగారం పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన గురువారం డిండి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని శామలబాయితండాకు చెందిన కట్రావత్ భారతి తన భర్త నానుతో కలిసి హైదరాబాద్ వెళ్లడానికి సాయంత్రం 7.15 గంటలకు డిండి బస్టాండ్‌కు చేరుకుంది. బస్సు ఎక్కడానికి వెళ్తున్న క్రమంలో బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని 1.5 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని వెళ్లారు. ఈ సమయంలో బస్టాండ్‌లో కరెంట్ లేక చీకటిగా ఉండడంతో నిందితులను గుర్తుపట్టడం కష్టంగా మారిందని బాధితురాలు పేర్కొంది. ఈ మేరకు భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని సిలార్‌మియాగూడేనికి చెందిన దాసరి శ్రీను మధ్యాహ్నం సమయంలో ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి వ్యవసాయ బావికి వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధర్మా తెలిపారు.

పెళ్లి కావడం లేదని..

- మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న యువకుడు


మాచర్ల శ్రీకాంత్ (ఫైల్)

శాలిగౌరారం: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో బుధవారం రాత్రి జరగగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెర్కకొండారం గ్రామానికి చెందిన మాచర్ల శ్రీకాంత్(27) గ్రామపంచాయతీలో గత నాలుగు సంవత్సరాల నుంచి మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీకాంత్‌కు కుటుంబసభ్యులు, బంధువులు వివాహ సంబంధాలు చూస్తున్నా.. ఎక్కడా కుదరడం లేదు. ఈక్రమంలో అతను ఇటీవల మద్యానికి బానిసై విధులు మానేశాడు. దీంతో కుటుంబసభ్యులు శ్రీకాంత్‌ను మందలించగా.. తిరిగి విధులకు వెళ్తున్నాడు. బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని నకిరేకల్ మండలం ఓగోడు లింక్ రోడ్డులో గల గ్రామపంచాయతీ తాగునీటి బోరుమోటారును పెట్టేందుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి స్పృహ తప్పి కిందపడి ఉన్నాడు. గ్రామానికి చెందిన దేవరకొండ రాంబాబు ఆ మార్గం గుండా వస్తుండగా శ్రీకాంత్ పడిపోయి ఉండటాన్ని గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే వారు అక్కడకు చేరుకుని అతడిని ద్విచక్ర వాహనంపై నకిరేకల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గురువారం మృతుడి తల్లి మాచర్ల అండాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య


కావ్య (ఫైల్)

ఆలేరురూరల్: ఆలేరులోని రెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న వివాహిత ఎం.కావ్య(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. మోటకొండూర్ మండలం మాటూరు గ్రామానికి చెందిన దడిగె కావ్యకు యాదగిరిగుట్ట మండలం బాహుపేటకు చెందిన మచ్చ శ్రీనివాస్‌తో ఆరు నెలల క్రితం వివాహమైంది. వీరు రెడ్డిగూడెంలోని నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం కావ్య ఇంట్లోని పడకగదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన భర్త శ్రీనివాస్ చుట్టుపక్కల వారి సాయంతో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. అదనపు కట్నం కోసం హత్యచేసి.. ఆత్మహత్య చేసుకుందని చెబుతున్నారని మృతిరాలి తల్లితండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేరకు శ్రీనివాస్, మరో నలుగురిపై వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటశ్రీను తెలిపారు.

పురుగుల మందు తాగి..


గంధమల్ల శ్రీను (ఫైల్)

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన గంధమల్ల శ్రీను(26) పురుగుల మందు తాగి ఆత్యహత్యకు పాల్పడ్డాడు. అవివాహితుడైన శ్రీను కొన్ని రోజులుగా మానసిక ఆందోళనతో సతమతమవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో గడ్డి మందును తాగగా.. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై గురువారం రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న ఏసీపీ

రాజాపేట: మండలంలోని పొట్టిమర్రి వద్ద ఉన్న వైన్‌షాపులో చోరీకి పాల్పడిన నిందితులు పట్టుబడినట్లు ఏసీపీ శివరాంరెడ్డి గురువారం రాత్రి తెలిపారు. వివరాల ప్రకారం.. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి పోలీసు బృందంతో రాజాపేట మండలంలోని పాముకుంట సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా యాదగిరిగుట్ట వైపు నుంచి ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండటాన్ని గమనించి తనిఖీ చేశారు. వీరిని కామారెడ్డి జిల్లా రాజునగర్‌కు చెందిన పిన్నోజు రవి, ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా లేపాక్షి మండలానికి చెందిన బైరప్పగారి హరీష్‌గా గుర్తించారు. వీరి వద్ద రూ.4లక్షల45వేల నగదు, 10 మద్యం సీసాలు లభించాయని, అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారించగా మండలంలోని రఘునాథపురం మదిర గ్రామం పొట్టిమర్రిలోని వైన్స్‌షాపులో షటర్ పగులగొట్టి చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సదాశివనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైన్‌షాపులో, గతంలో కరీంనగర్, మెదక్, హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇటీవల జైలు నుంచి విడుదలై తిరిగి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఈ ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో యాదగిరిగుట్ట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రామన్నపేట ఎంపీపీపై అవిశ్వాసం

- ఆర్డీఓకు నోటీసు అందజేసిన సభ్యులు


చౌటుప్పల్ ఆర్డీఓకు అవిశ్వాసం నోటీసు అందజేస్తున్న కాంగ్రెస్, సీపీఎం ఎంపీటీసీలు

రామన్నపేట : రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిపై 10 మంది ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఈ మేరకు గురువారం సంతకాలతో కూడిన నోటీసును చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావుకు అందజేశారు. ఎంపీపీ జ్యోతి ఎంపీటీసీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా, మండల పరిషత్ తీర్మానాలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అభివృద్ధి పనులు చేయకుండా ఆపుతున్నారని అవిశ్వాసం నోటీసులో పేర్కొన్నారు. నోటీసు అందజేసిన వారిలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు పూస బాలమణి, ఎర్రోళ్ల లక్ష్మమ్మ, బడుగు రమేష్‌బాబు, వనం హర్షిని, ఏనుగు పుష్పమ్మ, రెహాన్ మహ్మద్, మడూరి జ్యోతి, గోగు పద్మ ఉన్నారు.

మారిన సమీకరణాలు

మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఐదు, టీఆర్‌ఎస్‌కు ఆరు, సీపీఎంకు మూడు స్థానాలు దక్కాయి. ఇంద్రపాలనగరం ఎంపీటీసీగా పూస బాలమణి ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. సీపీఎం సభ్యులతోపాటు, బీఆర్‌ఎస్ ఎంపీటీసీ ఎండీ రెహాన్ మద్దతుతో కాంగ్రెస్‌పార్టీకి చెందిన కన్నెబోయిన జ్యోతి ఎంపీపీగా, నాగటి ఉపేందర్ వైస్‌ఎంపీపీగా ఎన్నికయ్యారు. కొద్ది రోజులకే ఎంపీపీ జ్యోతితోపాటు కాంగ్రెస్ తరఫున గెలిచిన మరో ముగ్గురు ఎంపీటీసీలు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన నలుగురు సభ్యులు ఎంపీపీకి మద్దతుగా నిలువడంతో వారి బలం ఎనిమిదికి చేరింది.

ఎంపీపీ నిర్ణయాలతో విభేదించి..

2020–21 సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం, జనరల్‌ఫండ్స్‌ను మెజార్టీ సభ్యుల తీర్మానం పేరుతో కొందరు సభ్యులకు కేటాయించలేదు. దీంతో సీపీఎం, బీఆర్‌ఎస్, ఇండిపెండెంట్ సభ్యులు ఎంపీపీ నిర్ణయాలతో విభేదించారు. మండల పరిషత్ సమావేశం వేదికగా నిరసన కూడా తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు, ఇండిపెండెంట్ కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల అనంతరం మరో ఇద్దరు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీ మారకుండా నిలిచిన హర్షినితో కలుపుకొని కాంగ్రెస్‌పార్టీ బలం ఏడుకు చేరింది. కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు, సీపీఎంకు చెందిన ముగ్గురు సభ్యులు కలిసి గురువారం ఆర్డీఓకు అవిశ్వాసం నోటీసు అందజేశారు.

డేటా ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలి

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజా పాలన దరఖాస్తుల డేటా ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు నియోజక వర్గాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, ఎ.వెంకట్ రెడ్డిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మొత్తం 489 బృందాలను ఏర్పాటు చేశామని, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలో ప్రజాపాలన చివరి రోజు వరకు దాదాపు 4 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 475 గ్రామపంచాయతీలకు గాను 389 బృందాలు, ఐదు మున్సిపాలిటీలకు 100 బృందాలు నియమించామని పేర్కొన్నారు. డేటా ఎంట్రీలో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ఆపరేటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. 5న నియోజకవర్గాల వారీగా వెబెక్స్ ద్వారా కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. ముందుగా హుజూర్ నగర్ 6.00 గంటలకు, కోదాడ 6.45కు , సూర్యాపేట7.30 గంటలకు , తుంగతుర్తి 8.15 గంటలకు కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. సమావేశంలో జెడ్పీసీఈఓ సురేష్ కుమార్, డీఆర్డీఓ కిరణ్ కుమార్, డీపీఓ యాదయ్య, సీపీఓ జి. వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమాధికారిణి జ్యోతి పద్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ కోటా చలం, ఏఓ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత పాటించాలి

ప్రజాపాలన కార్యక్రమం ప్రజలకు ఒక వేదిక కావాలని, దరఖాస్తుల స్వీకరణలో పారదర్శకత పాటించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు సూచించారు. గురువారం ఆరవ రోజు జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 51,547 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లాలోని 46 గ్రామ పంచాయతీల్లో 41,302 దరఖాస్తులు, 17 మున్సిపాలిటీల్లోని వార్డుల్లో 10,245 దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రజలు అభయ హస్తం దరఖాస్తులు అందక ఇబ్బందులు పడవద్దని, ప్రజాపాలన కార్యక్రమంలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

రిజిస్టర్‌లో నమోదు చేయాలి

చివ్వెంల(సూర్యాపేట) : ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు సూచించారు. ప్రజా పాలనలో భాగంగా చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామ సభలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

6న ఓటరు ముసాయిదా జాబితా

- యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కె.జెండగే


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, యాదాద్రి : ఓటరు ముసాయిదా జాబితా ఈనెల 6వ తేదీన వెల్లడిస్తామని కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. పోలింగ్‌కేంద్రాల హేతుబద్ధీకరణ, జాబితాలో వ్యత్యాసాలను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం ఈనెల 6నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఫిబ్రవరి 2 వరకు పరిష్కరిస్తామని, 8న తుది జాబితా ప్రచురిస్తామని చెప్పారు. చేర్పులు, మార్పుల కోసం పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయవచ్చని, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2023 నవంబర్ 11నుంచి జనవరి 3వ తేదీ వరకు 18,331 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీఓ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.